దంచికొట్టిన వర్షం

- దెబ్బతిన్న పంటలు



గాండ్లపెంట: వడగండ్లు పడటంతో దెబ్బతిన్న టమాట



ఆమిదాలకుంట వద్ద నేలకొరిగిన అరటి



మామిళ్లపల్లిలో వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

ఎన్‌పీకుంట: మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఖర్బూజ, దోస తదితర పంటలు దెబ్బతిన్నాయి. మరికొమ్మదిన్నె పంచాయతీలో 60 ఎకరాలలో సాగు చేసిన ఖర్బూజ, దోస పంటలో సుమారు 60 శాతానికి పైగా పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తిరుమల నాయుడు, సుబ్బారెడ్డి, బాబ్జాన్, రమణారెడ్డి, మనోహర్, మహమ్మద్ రఫీ, అల్లిభ, సహదేవ తెలిపారు. ఎకరా దోస పంటకి రూ.1.10 లక్షలు, ఖర్బూజ పంటకు రూ.లక్ష దాకా పెట్టుబడి పెట్టామన్నారు. మరో నాలుగు, ఐదు రోజుల్లో పంట కోయాల్సి ఉండగా అకాల వర్షంతో నష్టం వాటిల్లిందన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 57 మి.మీ వర్షపాతం నమోదైనట్లు సహాయ గణాంక అధికారి గంగాద్రి తెలిపారు. ఈదురుగాలుల ప్రభావంతో మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను, పెడబల్లి పంచాయతీల్లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, తొమ్మిది విద్యుత్ స్తంభాలు పడిపోయాయని ఏఈ సాలెహా బాషా తెలిపారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని అలీపూర్‌తండా సమీపంలో కురిసిన వడగళ్ల వానకు 7 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుమ్మరవాండ్లపల్లిలో సుబహాన్ సాగు చేస్తున్న ఏడున్నర ఎకరాల బొప్పాయి తోట గాలీవానకు దెబ్బతింది. ముత్యాలచెరువు వద్ద రైతు లక్ష్మీనారాయణరెడ్డికి చెందిన మొక్కజొన్న నేలవాలింది. అకాల వర్షాలకు కదిరి మండలంలోని 16 గ్రామాల్లో 232 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటలకు నష్టం వాటిల్లినట్లు ఏఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రాథమిక నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు వెల్లడించారు.

కదిరి టౌన్: పట్టణంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మున్సిపల్, కరెంట్ ఆఫీస్, ఈద్గా పరిసరాల ప్రాంతాల్లో పెద్ద చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరాఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వలీసాబ్ రోడ్డు, కంచుకోట, రాధాకృష్ణ వీధిలో మురుగు రోడ్లపై ప్రవహించింది. కుటాగుళ్ల గేట్ సమీపంలో శ్యారిన్ స్కూల్‌కు వెళ్లే దారిలో రేకుల షేడ్ పడిపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి వడగండ్ల వర్షం కురవడంతో కళింగ, బొప్పాయి, టమాట, బూడిద గుమ్మడి పంటలు దెబ్బతిన్నాయి. మామిడి పూవ్వు, పిందెలు రాలిపోయాయని వేపలకుంటకు చెందిన రైతు రామలింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వల్ల దాదాపుగా రూ.2 లక్షలు పెట్టుబడి నష్టపోయానని తెలిపాడు.

పుట్టపర్తి: బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో బుచ్చయ్యగారిపల్లి, జానకంపల్లి, కడపనాగేపల్లి, సిద్దరాంపురం తదితర గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి మామిడి పంట దెబ్బతింది. మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గాలీవాన బీభత్సం సృష్టించింది. మాల్యవంతం, సంజీవపురం, ఈదుల ముష్టూరు, పోట్లమర్రి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గరిశలపల్లి పంచాయతీలో దాదాపు పది మంది రైతులు తొలగించిన వేరుశనగ తడిసిపోయింది. రాఘువంపల్లిలో విశ్వనాథరెడ్డి పందిరి పద్ధతిలో సాగు చేసిన బీర పంట నేలకొరిగింది. ఈదురు ముష్టూరు గ్రామంలో నరసింహారెడ్డి ఐదు ఎకరాల్లో, ముత్యాలమ్మ 1.2 ఎకాలు, పెద్ద వెంకటేష్ 3 ఎకరాలు, లక్ష్మీదేవి 2 ఎకరాల్లో సాగు చేసిన అరటి నేలవాలింది. ఆర్బీకే వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

కొత్తచెరువు: మండలంలో తలమర్ల, మీర్జాపురం, కొడపగానిపల్లి, మరకుంటపల్లి, ఇళ్ల వెంకటంపల్లి తదితర గ్రామాల్లో దాదాపు వంద ఎకరాల్లో సాగు చేసిన మామిడి పంట దెబ్బతింది. అదే విధంగా 200 ఎకరాల్లో సాగైన మొక్కజొన్న, అరటి, కలింగర, దోస, టమాట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను అధికారులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు రైతులు తెలియజేశారు.

కనగానపల్లి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పండ్లతోటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మామిళ్లపల్లిలో లక్ష్మమ్మ ఇంటి పైకప్పు కూలిపోయింది. ఇంటి సామగ్రి, ధాన్యం పాడవటంతో రూ.20 వేల నష్టపోయినట్లు బాధితురాలు తెలిపింది. పర్వతదేవరపల్లి, కుర్లపల్లి, కనగానపల్లి, యలకుంట్ల గ్రామాల్లోని మామిడి, అరటి తోటలు నేలకొరిగాయి. కోతకు మామిడి పండ్లు నేలరాలాయని రైతులు వన్నూరప్ప, సుబ్రమణ్యం, ముత్యాలప్ప తెలిపారు. రబీలో వేరుశనగ సాగు చేసిన చేసిన రైతులు కూడా పంట తొలగించుకోవాటానికి ఇబ్బందులు పడుతున్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా శనివారం కురిసిన గాలీవానకు పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓబుళంపల్లి, న్యామద్దెల, బసంపల్లి, కనుముక్కల, చెన్నేకొత్తపల్లి, వెంకటంపల్లి, కోటంపల్లి, ఆమిదాలకుంట గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, అరటి, బీర, వరి పంటలు గాలీవానకు పూర్తిగా నేలకొరిగాయి. మండల వ్యాప్తంగా దాదాపు 200 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు గాలీవానకు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



బత్తలపల్లి: పోట్లమర్రిలో నేలవాలిన మొక్కజొన్న



కొత్తచెరువు: తలమర్ల వద్ద నేలరాలిన మామిడి



ఎన్‌పీకుంట: కళింగర పంటలో చేరిన నీరు



బత్తలపల్లి: అనంతసాగరంలో దెబ్బతిన్న అరటి

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని చిప్పలమడుగు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం అనుమానస్పద స్థితిలో లభ్యమైంది. ఆదివారం అటుగా వెళ్తున్న స్థానికులు మృతదేహాన్ని చూసి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు రూరల్ అప్‌గ్రేడ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. మృతదేహం వాసన వస్తుండటంతో సదరు వ్యక్తి చనిపోయి 4 రోజులు అయ్యి ఉంటుందని చెప్పారు. మృతదేహం పక్కన మద్యం బాటిల్, పురుగుల మందు డబ్బా ఉండటంతో మద్యంలో పురుగుల మందు కలిపి తాగి మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు.

47 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరసింహులు

ధర్మవరం అర్బన్: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న మధు కంటి ఆసుపత్రిలో ఆదివారం ప్రపంచ నీటి కాసుల వ్యాధి వారోత్సవాల సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వైద్యుడు నరసింహులు మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్నవారు, కంటి శుక్లం, నీటి కాలుష్య వ్యాధి తదితర వ్యాధులకు ఉచిత వైద్య చికిత్సలు అందించామన్నారు. కంటిచూపు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 47 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

'సత్యసాయి' కార్మికుల నిరసన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

తాడిమర్రి: తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని సత్యసాయి కార్మికులు ఆదివారం నిరసన తెలిపారు. స్థానిక మద్దులచెర్వు తాగు నీటి సంపు వద్ద కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమం మూడవ రోజుకు చేరుకుంది. సత్యసాయి తాగునీటి కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించే వరకూ తాగు నీటి సరఫరా చేయమని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మహేశ్వర్‌రెడ్డి, నడిపి ఓబిలేసు, నరసింహారెడ్డి తదితర కార్మికులు పాల్గొన్నారు.

నేడు స్పందన

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని మండల స్థాయి అధికారులు అందరు తప్పక హాజరుకావాలని కోరారు.


స్పందనలో సమస్యల పరిష్కారం

అమడగూరు: ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమస్యలను పరిష్కరించుకోవచ్చని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య తలెత్తినా ఆధార్ కార్డుతో పాటుగా సమస్యపై అర్జీని స్పందనలో ఇస్తే వెంటనే ఆ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు.

నివాళి

కదిరి టౌన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఈఎంఎస్ నంబూద్రి పాత్ వర్ధంతిని ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకురాలు శాంతిబాయి, అమరావతి, పూజిత, నాయకులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్ పాల్గొన్నారు.

ఘనంగా మదరసా వార్షికోత్సవం



మాట్లాడుతున్న మౌలానా అబ్దుల్ రహిమాన్

కదిరి అర్బన్: పట్టణంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న మదరసా రబ్బానియా వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మౌలానా అబ్దుల్ రహిమాన్.. ఖురాన్ పఠనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మదరసా కార్యదర్శి హాజీ అత్తార్ మహబూబ్‌బాషా, అధ్యక్షుడు హాజీ జాఫర్ సాదిక్, అజీంఖాన్, అన్వర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీఈటీ హనీఫ్

నల్లమాడ: స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరెస్పాండెంట్ పోలే స్వర్ణలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కదిరి ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయన్నారు. హర్ష, నందకిశోర్, శివ, జశ్వంత్, వంశీ, నందిని, కావ్య హ్యాండ్‌బాల్‌కు, రష్మిణి, రోహిత్, ఉమేష్, ఉమ్మర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. మే నెలలో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు డైరెక్టర్, కరెస్పాండెంట్, పీఈటీ హనీఫ్ అభినందనలు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి



జంగా కృష్ణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న రాప్తాడు వాల్మీకి సంఘం నాయకులు

కనగానపల్లి: వెనుకబడి కులాల కింద ఉన్న వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని రాప్తాడు నియోజకవర్గ వాల్మీకి సంఘం నాయకులు రాష్ట్ర బీసీ ఫెడరేషన్ నాయకుడు జంగా కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై నిర్వహిస్తున్న బీసీ సదస్సుకు వాల్మీకి సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అసెంబ్లీలో తీర్మానం చేయించాలని అక్కడి నాయకులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ ప్రభాకర్, గ్రీనింగ్ అండ్ బ్యూటీషియన్ డైరెక్టర్ రామాంజనేయులు, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బొగ్గు కృష్ణ పాల్గొన్నారు.

23న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

యాడికి: రాయలచెరువు గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, గ్రామస్తుల సహకారంతో లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచు తలారీ అరుణ, ఆలయ ధర్మకర్త శివ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వృషభాల యజమానులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రూ 80వేలు, సిద్దిగిరి శ్రీధర్ రెడ్డి రూ.50వేలు, బ్రహ్మానందరెడ్డి రూ.30 వేలు, ఉపేంద్రగౌడ్, లోకేష్ గౌడ్ రూ.20 వేలు, టీచర్ మనోహర్ రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తారన్నారు. పోటీలో పాల్గొనే వారు 23 ఉదయం రూ.1,000 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 9705728208, 6303187313, నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న నృత్యాంజలి



ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఆదివారం రాత్రి నిర్వహించిన నృత్యాంజలి కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. మానస నృత్య కళా కేంద్రం నిర్వాహకురాలు మానస ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యాంజలి కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్మెన్లు భాగ్యలక్ష్మి, నాగరాజు, జబర్దస్త్ మురళి, సినీ నటుడు తేజోమూర్తి, మురళీధర్, రంగస్థల సకలవృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెద్దిపోగు ఆనంద్ హాజరయ్యారు. అనంతరం కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి.

మద్యం విక్రేతల అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

రొద్దం: మండలంలోని కోగిర గ్రామంలో ఆదివారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. గోవిందు, మల్లికార్జున అనే ఇద్దరి నుంచి 40 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూదరులు..

హిందూపురం: మండల పరిధిలోని చిన్నగుడ్డంపల్లి వద్ద జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.8,430 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. చిన్నగుడ్డంపల్లి వద్ద గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడిచేసి జూదరులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

అడవులను సంరక్షిస్తేనే మనుగడ

రొద్దం: ప్రతి పౌరుడు అడవులను సంరక్షిస్తేనే రాబోవు తరాలకు మనుగడ ఉంటుందని చిగురు కోఆర్డినేటర్ రామన్న అన్నారు. టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన చిగురు, కల్పవల్లి ఆధ్వర్యంలో మండలంలోని శ్యాపురం కల్పవల్లి అటవీలో ఆదివారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిగురు కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అడువులను కాపాడాలన్నారు. అడవులను పరిక్షించడం, పెంపకం, ప్రకృతి పర్యావరణంపై అవగాహన కల్పించారు. వాటర్ షేడ్, ఆహార గొలుసు, వాతావరణంలో మార్పులు, అడవుల సంరక్షణ, గడ్డి భూములు, అడవులకు నిప్పు పెడితే జరిగే అనర్థాలు తదితర నమూనాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్పవల్లి సీఈఓ చిరంజీవి, రమేష్, అధ్యక్షుడు నాగరాజు, సిబ్బంది, చిగురు బాలల సంఘం చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు పరీక్షలు

కనగానపల్లి: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు సోమవారం పరీక్షలు చేస్తున్నట్లు ఐఈఆర్టీ ఎంఈఓ అరుణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉపకరణాలు అందించేందుకు పిల్లలను భవిత కేంద్రానికి తీసుకొచ్చి పరీక్షలు చేయించాలన్నారు.

శుభకార్యం

నల్లమాడ: మండలంలోని నల్లసింగయ్యగారి పల్లికి చెందిన ముక్తాపురం రవీంద్రారెడ్డి కుమారుడు అనిల్‌కుమార్‌రెడ్డి వివాహం జరిగింది. ఆదివారం గ్రామంలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, మాజీ రెస్కో చైర్మన్ దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగిరెడ్డి, వై.మోహన్‌రెడ్డి, హరినాథరెడ్డి, యోగ, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం నివేదికలు అందజేయాలి

కదిరి అర్బన్: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం నివేదికలను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి పంపించాలని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపల్ గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న గృహాలను రెవెన్యూ అధికారులు సందర్శించాలన్నారు. పూర్తి వివరాలతో నివేదికలు పంపించాలని పేర్కొన్నారు. నష్టపోయిన వారందరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

రుణాల రెన్యూవల్ గడువు పెంచాలి

తనకల్లు: పంట రుణాల రెన్యూవల్‌లో మార్పులు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం బ్యాంకుల్లో రుణాలు తక్కువగా ఇస్తున్నారన్నారు. ఎకరాకు రూ.50 వేలు తగ్గకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దకారు రైతులకు ఎకరాకు రూ.4 లక్షలు పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన రైతులందరికీ కొత్త పంట రుణాలను అందజేయాలని కోరారు. రుణాల రెన్యూవల్ గడువు ఆగస్టు 30వ తేదీ వరకూ పెంచాలన్నారు.

నేటి నుంచి ఉగాది వేడుకలు

చెన్నేకొత్తపల్లి: మండలంలో ప్రసిద్ధిగాంచిన ఒంటికొండ అక్కులమ్మ గారి ఉగాది వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. అత్యంత పెద్ద ఎత్తున జరగనున్న ఉగాది వేడుకలకు మండల వాప్తంగా పలు గ్రామాల ప్రజలు తరలివస్తారు. సోమవారం సాయంత్రం ఎలువగంప ఊరేగింపు, 21న జలధి బుగ్గలోకి తరలివెల్లడం, 22న పన్నేరపు బండ్ల ఊరేగింపు, 23న కుంకుమలు, పరుస, 24న పోతులరాజుకు గావుల మహోత్సవం జరుగుతుంది.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ఓడీ చెరువు: మండలంలోని ఆకుతోటపల్లిలో ఆదివారం చాకలి శంకర్‌కు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవును మేత కోసం పొలంలోకి తీసుకెళ్లి.. ఇంటికి తోలుకుని వస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన స్టే వైర్‌కు విద్యుత్ ప్రసరించడంతో విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. ఆవు మృతి చెందడంతో రూ.70 వేల వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు.

మద్యం తరలిస్తే నాన్ బెయిలబుల్ కేసులు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ వెంకటనారాయణ

అమడగూరు: అక్రమంగా మద్యం, గుట్కా తరలిస్తూ పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆదివారం అమడగూరు బార్డర్, లోకోజుపల్లి కర్ణాటక బార్డర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఏదేని సమస్య వచ్చినా 100 డయల్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండకపోతే మోసాలకు గురి అవుతారన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా చంద్రశేఖర్



పుట్టపర్తి టౌన్: సత్యసాయి జిల్లా యూటీఎఫ్ కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పెనుకొండలో రవీంద్ర భారతి పాఠశాలలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం జిల్లా కార్యదర్శిగా పుట్టపర్తికి చెందిన చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై రాజీ లేనిపోరాటం చేస్తామన్నారు.

పశువుల దేవుడు పడమటి వీరన్న

- ఆ మహనీయుడి పేరు తలచుకుంటే పశువులకు రోగాలు మాయం
- రేపు జాతర



పూజలందుకున్న పడమటి వీరన్న స్వామి

తాడిమర్రి: మండలంలోని ఆత్మకూరు గ్రామ సమీపంలో వెలసిన పడమటి వీరన్న పశుబాంధవుడిగా వెలుగొందుతున్నాడు. ఆ మహనీయుడి పేరు తలచుకుంటే పశువులకు వచ్చిన ఎటువంటి రోగాలైనా మాయం అవుతాయని ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం. పూర్వం పడమటి దిక్కున నుంచి వచ్చిన వీరన్న అనే వ్యక్తి ఆత్మకూరులో పశువుల కాపరిగా స్థిరపడ్డారు. పశువులను మేపుతూ వాటిని కంటికి రెప్పలా కాపాడేవారు. పశువులకు వచ్చే ఎటువంటి రోగాలకు అయినా ఆయన వైద్యం అందిస్తే ఇట్టే నయం అయ్యేవి. ఆయన పరమపదించిన రోజున ఉగాది పండుగ ముందురోజున ఈనెల 21వ తేదీన గ్రామస్తులు పెద్ద జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది. పశువుల దేవుడిగా పిలువబడే పడమటి వీరన్న ఉత్సవాలను పురష్కరించుకొని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం, నార్పల తదితర మండలాల నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఎండ్లబండ్లపై వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఈ దేవుడిని కొలవడం వల్ల పశువులకు ఎటువంటి ఆపదలు, రోగాలు రావని రైతుల ప్రగాఢ నమ్మకం. అలాగే ఉగాది రోజున సైతం భక్తులు దేవాలయం చుట్టూ బండ్లను తిప్పి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.